# మదర్

టెంపోరావ్



సాయిబాబా అనాధాశ్రమం కార్యదర్శి రత్తమ్మకెదురుగా నిలబడ్డాడు రమేష్. ఇరవై రెండేళ్ల యువకుడు. పొడుగ్గా బలంగా వుంటాడు. పోలిటెక్నిక్‌లో ఎల్. ఎమ్. ఇ. పాసయ్యాడు.

రత్తమ్మ వయస్సు నలభై యారు వుంటుంది. ఇరవై యేళ్ల క్రితం అనాధాశ్రమాన్ని స్థాపించి జయప్రదంగా నడుపుతోంది. ఎందరో అనాధలు ఏళ్లతరబడి అక్కడ పెరిగి, రెక్కలొచ్చాక వేరుగా వెళ్లిపోతుంటారు. అందరూ ఆమెను "మదర్" అని ఆప్యాయంగా పిలుస్తూ వుంటారు వయసుమళ్లినా ఆమె కళ్లల్లోని కాంతి ఏమాత్రం తరగలేదు.

ఆమె నవ్వుతూ అతడి వంక చూసింది.

"రమేష్, కూర్చో" అందామె.

అతడు కుర్చీలో కూర్చున్నాడు. వినయంగా ఆమెవైపు చూశాడు.

"ఎల్. ఎమ్. ఇ. పాసయ్యావు. ఇకపైన ఏం చెయ్యదల్చుకున్నావు?" ప్రశ్నించిందామె.

"మదర్, ఉద్యోగం కోసం చూస్తున్నా. కొన్ని కంపెనీలకు అప్లికేషన్లు పంపాను."

"నీకు మంచి ఉద్యోగం వస్తుంది. నువ్వు వృద్ధిలోకి వస్తావు," అందామె ఆశీర్వదిస్తున్నట్లు.

"మదర్, ఇరవై యేళ్లు పైగా మీరు నన్ను తల్లిలా చూశారు. నాకు చదువుకునే అవకాశం కల్పించారు. మిమ్మల్ని ఈ జీవితంలో మరువలేను," అన్నాడతను ఉద్రేకంతో.

క్షణకాలం ఆమె అతడివైపు మౌనంగా చూసింది.

"బాబూ, నీ మాటలు నాకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఇక్కడుండే వాళ్లను నా బిడ్డలుగా భావించుకుంటూ జీవించడం నాకెంతో తృప్తినిస్తోంది. తల్లి తనబిడ్డల అభివృద్ధికి పాటుపడటం మామూలేగా?"

కృతజ్ఞతతో అతడు రత్తమ్మవైపు చూశాడు. ఆమె గతజీవితం గురించి నిజం తెలీదు. చిన్నతనంలో పెళ్లయిందనీ, భర్త మరణించాడనీ, అటుపిమ్మట ఈ అనాధాశ్రమాన్ని ఆమె ప్రారంభించిందనీ కొందరు చెప్పుకుంటూ వుంటారు. కుర్చీలోంచి లేచి ఆమెకి నమస్కరించి రమేష్ తన గదికి వెళ్లిపోయాడు.

రమేష్ ఆ రోజు చాలా ఆనందంగా వున్నాడు. బరువుగావున్న ఒక కవర్ని రత్తమ్మ టేబుల్‌మీద పెట్టి ఆమెవైపు మెరిసే కళ్లతో చూశాడు.

"రమేష్, ఏమిటంత ఉషారుగా వున్నావు?"

"నా తల్లిదండ్రులు నా ముందుంచే ఆ కవర్ని వాళ్లకిచ్చి నన్నాశీర్వదించ

మనేవాడివి. అదంతా జరగనిది. మదర్, నాకు తల్లీదండ్రీ మీరే. ఆ కవర్లో నా మొదటినెల జీతం వుంది. ఆరొందల యాభై రూపాయిలు! అవి స్వీకరించి నన్ను దీవించండి!" అన్నాడతను ఉద్రేకంతో.

ఆమె కవర్ని తెరిచి, నోట్లను ముట్టుకుని అతడ్ని దీవించింది. నోట్లను కవర్లో పెట్టి అతడి కిచ్చేసింది.

"మదర్, ఈ డబ్బుతో మీరేదేనా కొనుక్కోండి. నాకు చాలా ఆనందంగా వుంటుంది," అన్నాడతను.

నవ్వుతూ ఆమె అతడివంక చూసింది.

"రమేష్, ప్రస్తుతం నాకేవీ అక్కర్లేదు. ఈ డబ్బును నీ పేర బాంక్‌లో వుంచుకో. డబ్బొక మహత్తర శక్తి. అది గుర్తుంచుకో."

"మదర్, నా అభివృద్ధికి చెయ్యూత నిచ్చిన ఈ అనాధాశ్రమం ఖర్చులకు ఆ డబ్బు వాడండి."

"ప్రస్తుతం అవసరం లేదు. అటువంటి పరిస్థితి వస్తే నేనే అడుగుతాను."

ఆమె అతడి కళ్లల్లోకి సూటిగా చూసింది.

"రమేష్, నువ్వు ఉద్యోగంలో చేరి నెలయింది. నీకు చక్కటి దుస్తులు, మంచి బూట్లు మొదలైనవి కావాలి. అవన్నీ సమకూర్చుకో! నువ్వు నీ కాళ్ల మీద స్థిరంగా నుంచున్నాక ఇతర్లకు సహాయపడొచ్చు," అని సలహా యిచ్చిందామె.

"మీరు చెప్పినట్లే చేస్తాను, మదర్," అని సెలవుతీసుకుని అతను కదిలాడు.

ఆనాడు పదివరకూ ఆఫీసులో పనిచేసి రమేష్ బీచ్‌మీదుగా యింటికి నడుస్తున్నాడు. అమావాశ్య అవడంవలన చీకటిగా వుంది. సముద్రపుహోరు వినిపిస్తోంది. ఆ సమయంలో బీచ్ నిర్మానుష్యంగా వుంది.

పూలమొక్కల పక్కన నల్లటి ఫియట్‌కా రాగివుంది. అందులోంచి ఒక యువతి కంఠం అతడికి వినపడింది.

"ప్లీజ్, వదలండి! నన్ను పోనీయండి" అందామె.

రమేష్ కొన్ని అడుగులువేసి కారు వెనక, చీకట్లో నిశ్శబ్దంగా నిలబడ్డాడు.

"అరిస్తే నోరు నొక్కేస్తాను. నిన్ను అనుభవిస్తేకాని వదలను. నేను చెప్పినట్లు నడుచుకో," అందో పురుషకంఠం.

"ప్లీజ్, వద్దు!" అర్చిందామె.

వెనుక సీటుమీద ఆమె అతడితో పెనుగులాతోంది.

ఇంతకుముందు పత్రికల్లో ఎన్నో రేప్‌కేసులను గురించి చదివి అతను పళ్ళు పటపట కొరికాడు. ఈనాడు అటువంటి ఘోరదృశ్యం తనముందు సాగుతోంది.

అతడు పిడికిలి బిగించాడు. రక్తం పొంగుతోంది. ఆగ్రహంతో 'ఒళ్లు వేడెక్కింది. గబగబా ముందుకి అడుగులు వేసి తటాలున కారు వెనుకతలుపును తెరిచాడు. దేవుడా అంటూ ఆమె బయటకు దూకింది. వెనుకనే కారులోవున్న అరవైయేళ్లతను కిందకి దిగాడు అతడు తూలుతున్నాడు. మాట ముద్దగా వస్తోంది.

"రాస్కెల్, ఎవడ్రా నువ్వు?" అర్చాడతను.

"నీ పాలిటి యముడ్ని," అని గర్జిస్తూ రమేష్ అతడిమీదకు దూకాడు. నిషాలో వున్న అతడిని చితకబాదాడు.

నేలమీద పడున్న వ్యక్తివైపు రమేష్ కోపంగా చూశాడు. అతడు మూలుగుతున్నాడు. అరగంటదాకా అతడు లేవడు. రమేష్ వెనక్కితిరిగి ఆమె ముందుకు నడిచాడు.

ఆమె కృతజ్ఞతతో అతడివైపు చూసింది.

"దేవుడిలా వచ్చి నా మానాన్ని కాపాడారు," అందామె.

"ఈ పరిస్థితిలో ఎవరైనా మీకు సహాయపడేవారు. దాని కేముందులెండి."

"అందరూ కల్పించుకుని రంగంలోకి దిగరు. చాలామంది చూసీచూడనట్లు వెళ్లిపోతారు," అందామె.

"ఇంతకీ ఏమైందో చెప్పండి. ఈ ముసలిపులి కార్లో మీరు ఎలా ఎక్కారు?"

"నా తండ్రికి అనారోగ్యంగా వుంది. మందులు కొనడానికి వెళ్తుంటే ఇతడి కారొచ్చి నా పక్కనే ఆగింది. అతడు ఎక్కమన్నాడు. మంచివాడనుకుని కార్లో ఎక్కాను. మందులషాపుదగ్గర దింపుతానన్నాడు. అతడు బాగా తాగివున్నాడని ఆలస్యంగా గ్రహించాను. నే నెంత మొరపెట్టినా వినకుండా కారు నిక్కడికి తీసుకొచ్చాడు."

రమేష్ ఆమె పేరు, అడ్రసూ తెలుసుకున్నాడు.

"ఇటుపైన మీకు భయంలేదు. వాడిని గురించి నేను పోలీసులకి రిపోర్టు యిస్తాను. వాడి అంతం చూస్తాను."

"అదంతా ఎందుకు, వదిలెయ్యండి. ఏ అపచారమూ జరగలేదుగా?" అందామె.

"నేను అడ్డురాకపోతే ఏమయి వుండేదో ఆలోచించండి. వదిలేస్తే వాడికి బుద్ధిరాదు. ఈ ఓల్డ్ రాస్కెల్‌ని లాకప్‌లో పడేయించాలి." అన్నాడు రమేష్ కోపంగా.

ఆమెతో రోడ్డుదాకా నడిచాడతను. ధైర్యంచెప్పి ఆమెను సాగనంపాడు. క్షణకాలం కళ్లుమూసుకుని నిలబడ్డాడు.

'అమ్మా, నాన్నా- మీరెక్కడున్నారో కాని మీ సుపుత్రుడు ఒక మంచిపని చేసినందుకు సంతోషించండి,' అనుకున్నాడతను లోలోపల.

రోడ్డుదాటి సమీపంలోవున్న పోలీస్ స్టేషన్‌కు గబగబా నడిచాడు. అక్కడున్న ఇన్‌స్పెక్టర్‌కు అంతా వివరంగా చెప్పాడు.



"బీచ్‌కి పదండి. వాడింకా అక్కడే పడుంటాడు," అన్నాడతను.

"మిస్టర్, అక్కడకు మీరూ మాతో రావాలి," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"వస్తా," అన్నాడు రమేష్.

నల్లటి ఫియట్ కారుకు కొంచెం దూరంలో పడున్న వ్యక్తిని టార్చి కాంతిలో ఇన్‌స్పెక్టర్ చూశాడు. అతడి నాడిని పరీక్షించాడు.

"గుడ్‌గాడ్!" అంటూ ఇన్‌స్పెక్టర్ లేచాడు.

"ఏమైంది సార్?" అడిగాడు రమేష్

"ఆయన మరణించాడు. మిస్టర్ ఆయనెవరో మీకు తెలిసే వుండొచ్చు?"

"నాకు తెలియదు సార్."

"మిస్టర్ రమేష్. ఆయన పేరు పొందిన ఎమ్.ఎల్.ఎ. రాజారావుగారు. ఆయన్ని హత్యచేసినందుకు మిమ్మల్ని అరెస్టుచేస్తున్నా," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆయన్ని చంపాలనే ఉద్దేశం నాకు లేదుసార్" అర్చాడు రమేష్ గాభరాగా.

"అవన్నీ తరవాత కోర్టులో తేల్చుకోవలసిన విషయాలు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కటువుగా.

లాకప్‌లోవున్న రమేష్‌వైపు ఊచల మధ్యనుంచి రత్తమ్మ చూసింది. కళ్ళు నీళ్ళతో నిండాయి.

"రమేష్, ఎంత పని చేశావు!" అందామె.

ఆమెవంక సూటిగా చూశాడతను.

"నాలో ప్రవహించేది యువరక్తం, మదర్. కళ్లెదట అన్యాయం జరుగుతూంటే ఊరుకోలేకపోయాను."

"నువ్వెవర్ని చంపావో తెలుసా?"

"చెప్తూకుంటున్నారుగా అందరూ, అతడొక పేరుపొందిన ఎమ్. ఎల్. ఎ. అని!"

"వాళ్లకు తెలియనిది నీకు చెప్పవలసిన సమయం వచ్చింది. ఆయనే నీ తండ్రి!"

కొంతసేపు రమేష్ స్తంభించిపోయాడు.

"అది మీ కెలా తెలుసు?" అడిగాడు.

"నాకు తెలుసు. నీ తల్లిని నేనే," అందామె కన్నీరు కారుస్తూ.

అతడు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఆమెవైపు చూస్తూ వుండిపోయాడు.

"రమేష్, ఇది ఇరవైరెండేళ్ల క్రితం జరిగిన కథ. ఆయనతో నాకు పరిచయం అయింది. ఇద్దరం దగ్గరయ్యాం. ఆయన పెళ్లయిన వ్యక్తి. నాతో ఆయన కలిసి జీవించడం అసంభవం. నిన్ను రహస్యంగా కన్నాను. అనాధాశ్రమం స్థాపించి నిన్ను అందులో చేర్పించాను."

"అమ్మా ఇనేళ్లు దాచిన ఈ నిప్పులాంటి రహస్యాన్ని ఈనాడు నాకు చెప్పకుండా వుంటే బాగుండేదేమో! ఒక దుష్టుడ్ని శిక్షించాననే తృప్తి నాకుండేది, కాని ఇప్పుడు నన్ను రంపంలా కోస్తోంది తండ్రిని అంతంచేశానన్న బాధ."

"ఆయన బతికుండగా నిజం నీకు చెప్పనని వాగ్దానం చేశాను. ఆయన పోయాక ఇక దాచలేక నిజం చెప్పేశాను" అందామె.

"అమ్మా, నువ్వు చెప్పింది విన్నాక జరిగిందానికి చాలా బాధపడుతున్నాను. తండ్రి దైవంతో సమానం అంటారు. నేను చేసిన పాపం జీవితాంతం నన్ను పీడిస్తూనే వుంటుందమ్మా," అని రమేష్ ఏడుస్తూ మొహాన్ని చేతుల్తో కప్పేసుకున్నాడు.

రత్తమ్మ అతడికేసి చూస్తూ నిలబడింది.

"రమేష్! మనిషి మంచి చెడుల కలయిక. నువ్వు దెబ్బకొట్టింది నీ తండ్రి అవినీతిని. నీ తండ్రిలోని మంచి నీలో జీవించే వుంటుంది. మనిషిలోని మంచికి చావులేదు. అది జ్యోతిలా తరతరాలుగా వెలుగుతూనే వుంటుంది." అందామె.

కన్నీళ్లతో అతడామెవైపు తిరిగాడు.

"అమ్మా, అమ్మా!" అర్చాడతను.

అతనివైపు క్షణకాలం చూసి ఆమె మౌనంగా వెనక్కి తిరిగింది.

రత్తమ్మ ఇన్‌స్పెక్టర్ ముందుకి వెళ్లింది. అతడు నమస్కరించి ఆమెను కూర్చోమన్నాడు.

"ఇన్‌స్పెక్టర్, రమేష్ చాలా బుద్ధిమంతుడు. అతడు ఈ హత్యకేసులో ఇరుక్కోవడం విచిత్రంగా వుంది." అందామె.

"రత్తమ్మగారూ, యిది హత్యనుకుని పొరబడ్డాం. రాజారావుగారు హార్ట్ పేషంటు. రమేష్ కొట్టడంమూలంగా ఆయన మరణించలేదనీ, కార్డియక్ అరెస్టువలన ఆయన చనిపోయారని మా డాక్టర్ రిపోర్టుద్వారా తెలిసింది. త్వరలో రమేష్‌ని మేం విడుదల చేస్తాం." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"శుభవార్త," అని ఆమె కుర్చీలోంచి లేచింది.

